క్లుప్తంగా

బాల్య వివాహం నేరం

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలు చేయడం నేరమని ఎంపీడీఓ కుమార్ పట్నాయక్ అన్నారు. జరజాంలో ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికకు వివాహం చేస్తున్నారని చైల్డ్‌లైన్‌కు అందించిన ఫిర్యాదు మేరకు గురువారం గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను చదివించాలని, ప్రభుత్వం నిర్ణయించిన వయస్సు వచ్చాకే వివాహం చేయాలని సూచించారు. గ్రామ కమిటీ పర్యవేక్షించనుందని చెప్పారు.

జీవామృతాలతో పోషకాలు



ఘన జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల : నేలలోని పోషకాలు అభివృద్ధికి పీఎండీఎస్, ఘన, ద్రవ జీవామృతాలు వాడాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి చంద్రకళ రైతులకు సూచించారు. కేశవరావుపేటలో గురువారం ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతాలతో భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పూర్ణ, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: జి.సిగడాం మండలం ఆనందపురం పంచాయతీ ఆబోతులపేట ఎస్సీ కాలనీ పెద్దలు, యువత వినతి మేరకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జి.సిగడాం వ్యవసాయ సలహా మండలి సభ్యులు మక్కా వెంకటసాయికి ఈ మొత్తం అందజేశారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని మండల మెజిస్ట్రేట్ పప్పల వేణుగోపాలరావు హెచ్చరించారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన పలువురిని గురువారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అరసవల్లిలో మహా లింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు క్షేమేంద్ర శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ మాసశివరాత్రి సందర్భంగా గురువారం మహా లింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో శ్రీచక్ర శివ పంచాయతన సహిత మహా లింగార్చన అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి చుక్కల జింక



జింకకు వైద్య సేవలు చేయిస్తున్న రేంజర్ రాజశేఖర్

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు గల కేజీబీవీ పాఠశాల వద్దకు గురువారం ఉదయం కుక్కలు తరమడంతో చుక్కల జింక చేరుకుంది. స్థానిక యువకులు కుక్కలను తరిమి, జింకను పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఫారెస్టు సిబ్బంది వచ్చి అంతరాబ ఫారెస్ట్ కార్యాలయానికి తీసుకువెళ్లారు. జింకకు వైద్యం అందించి, ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు అడవిలోకి విడిచిపెట్టామని ఎఫ్‌బీఓ యశస్వీ తెలిపారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

నరసన్నపేట: మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 16 కోట్లతో నాడు-నేడు రెండో విడత పనులు జరుగుతున్నాయని, వీటిని మే ఖరుకల్లా పూర్తిచేయాలని ఏఈ చంద్రమౌళి, ఎంఈఓ శాంతారావు సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం పిషిని గ్రామ సచివాలయ పరిధిలోని పతివాడపాలెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు ఉండి ఇంకా సంక్షేమ పథకాలు రాకపోతే వెంటనే సచివాలయంలో సంప్రదించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకే నేరుగా పథకాలు అందుతున్నాయని చెప్పారు. జగనన్న ఇళ్లు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదన్నారు. ఈ పథకాలు ఇలాగా కొనసాగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, చిల్ల వెంకట రెడ్డి, మహంతి పెదరామినాయుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్ల ఆనందరావు పాత్రుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, గొర్లె తిరుపతినాయుడు, పిషిణి సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ పతివాడ నాగమణి, నాయకులు పతివాడ సత్యం, బొంతు జగన్నాథం, కొలగాన రమణ, వంజరాపు శ్రీరాములు, బంగారు తాత, రెడ్డి సత్యమప్పలనాయుడు, రెడ్డి అప్పలనాయుడు, రెడ్డి వాసు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార: గార ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ రాధామాధవి ఓ ప్రకటనలో తెలిపారు. అంపోలు పంచాయతీ చల్లపేటలో అంగన్‌వాడీ ఆయా, శ్రీకూర్మం పంచాయతీ ఎస్.మత్స్యలేశంలో ఆయా, నీలాపుపేటలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, శ్రీకాకుళం రూరల్ మండలంలోని నైర పంచాయతీ వెంకటాపురంలో ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో చినరావుపల్లి, బలిజిపేట, కింతలిమిల్లు, బొంతలకోదూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని ఎంపీడీఓ కుమార్ పట్నాయక్ తెలిపారు.

రణస్థలం/లావేరు: లావేరు, రణస్థలం మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు, మిని అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను ఓపెన్ కేటగిరిలో భర్తీ చేస్తున్నామని రణస్థలం స్త్రీ-శిశు సంక్షేమాధికారిణి సీహెచ్ ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం మండలం సీహెచ్ కొవ్వాడలో కార్యకర్త, దేవునిపాలవలస, పతివాడపాలెం-1, యామాలవారీ కాలనీలో సహాయకులు, భావరాజుపాలెంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, లావేరు మండలం భరణికాంలో కార్యకర్త, పెద్ద లింగాలవలస-1, చిన్న రొంపివలస, భట్టుపాలెం గ్రామాల్లో సహాయకుల పోస్టులు భర్తీకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

27న పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: సిక్కోలు బుక్‌ట్రస్ట్, శ్రీకాకుళ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న నీటిగింజలు పుస్తకావిష్కరణ శ్రీకాకుళంలోని హోటల్ గ్రాండ్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ కథా, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి కె.శివారెడ్డి, జి.లక్ష్మీనరసయ్య తదితర ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సాయిమందిరంలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విశాఖ-బీ కాలనీలో షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 లీటర్ల పెరుగును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, జిల్ ఫౌండేషన్ సభ్యులు సత్యసాయి, జాడసాయి, ఉమా శంకర్, శివపాల్గొన్నారు.

దేవీ ఆలయంలో పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ విగ్రహానికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తం

శ్రీకాకుళం క్రైమ్ : దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందితో గురువారం పీఎస్ కాలనీ, డీసీసీబీ కాలనీ, ఎఎస్ఎన్ కాలనీలో ప్రచారం చేపట్టినట్లు సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. వేసవిలో ఎక్కువగా చోరీలు జరిగే అవకాశం ఉన్నందున తీర్థయాత్రలు, క్యాంపులకు వెళ్లే వారంతా విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, డాక్యుమెంట్లు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. పోలీసులకు ముందుగా సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఇంటికి గస్తీ పెంచుతామన్నారు. ఆరుబయట నిద్రపోయేవారు ఇంటికి తాళం వేయాలని, లైట్లు ఆన్‌చేసి ఉంచాలని సూచించారు.



డీసీసీబీ కాలనీలో ప్రచారం చేస్తున్న పోలీసులు

ఆటపాటలతో మానసికోల్లాసం

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం లోభాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.ఈశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సాయికృష్ణ, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఆటలతోనే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని పీఈటీ ఈశ్వరమ్మ, సహాయకులు భాగ్యలక్ష్మీ అన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో క్రీడల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలని మురపాక గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, రిసోర్సు పర్సన్ పి.సూర్యతేజశ్వని అన్నారు. మురపాక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: డ్రాయింగ్‌లో మెలకువలు వివరిస్తున్న ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.నీలమ్మ కోరారు.

రణస్థలం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జె.ఆర్.పురం హెడ్ కానిస్టేబుల్ ఎ.మన్మధరావు అన్నారు. రణస్థలం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ పి.వరలక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.



రణస్థలం: అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీ మన్మధరావు



ఎచ్చెర్ల: విద్యార్థులతో మాట్లాడుతున్న పీఈటీ ఈశ్వరమ్మ



లావేరు: డ్రాయింగ్‌లను చూపిస్తున్న విద్యార్థులు



ఎచ్చెర్ల క్యాంపస్: చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రి దృష్టికి రైతాంగ సమస్యలు

మందస: రైతుల సమస్యలను మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రిని గురువారం కలిశారు. రాజుల హయాం నుంచి మందస ప్రాంతంలో సాగునీటి వనరులున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో సద్వినియోగం కాలేదన్నారు. గోపాలసాగరం, సంకుజోడు, జంతిబంద, జెన్నాచెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చితే రైతులకు మేలు జరుగుతుందన్నారు. దామోదరసాగరం రిజర్వాయర్ కుడికాలువ పనులు నేటికీ పూర్తి కాలేదని మంత్రికి వివరించారు. బెల్లుపటియా వద్ద రాజుల కాలం నాటి వంతెన (దోనె) కుప్పకూలడంతో ఆయకట్టుకు సాగునీరు అందడంలేదన్నారు. చికిడిగాం జంపరగిరి పూర్తిగా పాడయ్యిందని, కళింగదళ్, డబారిసింగి కాలువలకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై మంత్రి సీదిరి సానుకూలంగా స్పందించినట్లు కామేశ్వరరావు తెలిపారు.



మంత్రి అప్పలరాజుకు సమస్యలు వివరిస్తున్న కామేశ్వరరావు

గురండిలో ఫ్యామిలీ డాక్టర్

కొత్తూరు: గురండి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సర్పంచ్ సింహాద్రి నాయుడు గురువారం ప్రారంభించారు. 70 మందికి వైద్యాధికారి ఎస్.తేజశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

ఇరుకైన వంతెనతో ఇక్కట్లు

జి.సిగడాం: పంట పొలాలకు సాగునీరు అందించే కాలువపై కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వంతెన నిర్మాణం చేపడుతున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దవళపేట-ఆనందపురం గ్రామాల ప్రధాన రహదారిలో మధ్యవలస సాగునీరు వెళ్లే పంటకాలువపై ఇరుకుగా వంతెన నిర్మిస్తుండటంతో తమ భూములు ముంపునకు గురయ్యే ప్రమాదముందని చెబుతున్నారు. ఒకవేళ వంతెన నిర్మించాల్సి వస్తే వెడల్పుతో మెరుగ్గా నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.



దవళపేట- ఆనందపురం మధ్య కాలువపై నిర్మిస్తున్న వంతెన

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన పడాల శంకరరావు, లక్ష్మీ దంపతులు గురువారం రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావుకు నగదు అందించారు.



విరాళం అందజేస్తున్న దాతలు

గాలి దుమారం.. నష్టం అపారం



జి.సిగడాం: పున్నాంలో దెబ్బతిన్న అరటి పంట

గార : మండలంలో బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. వంశధార నదీ తీర ప్రాంతంలో ఉన్న అరటి రైతులకు భారీ నష్టం మిగిల్చాయి. నెల రోజుల్లో పంట చేతికొచ్చే దశలో భారీ గాలుల కారణంగా మొక్కలు విరిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బూరవెల్లి, పూసర్లపాడు, శాలిహుండం, బోరవానిపేట, గార తదితర పంచాయతీల పరిధిలో 80 ఎకరాల్లో అరటి పంట నష్టం చేకూరినట్లు సచివాలయ సిబ్బంది అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

మామిడి రైతు కుదేలు..

జి.సిగడాం : ఈదురు గాలులు, అకాల వర్షం ధాటికి మామిడిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. జి.సిగడాం మండలంలో సుమారు 30ఎకరాల్లో మామిడి, 15 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్‌కు అంతరాయం

అరసవల్లి : నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి వీచిన తీవ్ర గాలులతో నగరంలో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ గాలుల కారణంగా చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 3.30 గంటల వరకు విద్యుత్ సిబ్బంది అధికారుల పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు నిర్వహించారు. నగరంలో డి-1, డి-2, డి-3 సెక్షన్లతో పాటు రూరల్ సెక్షన్‌లో కూడా దాదాపుగా విద్యుత్ సరఫరాను అందించారు. రూరల్‌లో ఇంకా పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. వర్షాలు, గాలులతో విద్యుత్ శాఖకు పలు చోట్ల నష్టం వాటిల్లిన నేపథ్యంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కార్యాలయం నుంచి జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ దైవప్రసాద్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురువారం సాయంత్రానికి దాదాపుగా విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించామని ఎస్ఈ తెలిపారు.



బాతువ-బూటుపేట మధ్య నేలరాలిన మామిడి పంట

సంక్షేమ పథకాలతోనే పేదరిక నిర్మూలన

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమ పథకాలతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. అల్లినగరంలో గురువారం పల్లె పల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వ పథకాలు అందజేసి కుటుంబాన్ని పేదరికం నుంచి ఆర్థిక ప్రగతి వైపు పయనించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక వంటి పథకాలు పేద కుటుంబాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని వివరించారు. అల్లినగరం గ్రామానికి ఈ ప్రభుత్వ హయాంలో రూ.3.22 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ టిగిటి మణి, ఎంపీటీసీ మాడుగుల స్వాతి, నాయకులు నక్క కృష్ణమూర్తి, బెందు రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

రెండు బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని హిరమండలం, కొత్తూరు మండలాల్లో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్, వంశధార ఇంజినీరింగ్ అధికారులకు గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రతిపాదనలు పంపించారు. కొత్తూరు మండలం గూనభద్ర రిజర్వాయర్‌పై భాగాన ఉన్న సుమారు 300 ఎకరాల మిగులు భూములకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రైతులు వ్యవసాయ పనులు చేయడానికి, పంటలు తీసుకురావడానికి సుమారు 13 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. పారాపురం వద్ద వరద కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వంశధార ఇంజినీరింగ్ ఈఈకి పాతపట్నంలోని తన క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే ప్రతిపాదనలు అందించారు. హిరమండలం మండలంలోని కిట్టాలపాడు వద్ద వంశధార వరద కాలువపై గతంలో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తది నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేస్తే కిట్టాలపాడు, పూనిపేట, అంతకాపల్లి, ఇప్పగూడ, సీదితోపాటు పలు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు.



ఈఈకి ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

లావేరు: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని తాళ్లవలస సచివాలయం ఎంఎస్‌కే ఎస్.కామేశ్వరీ అన్నారు. రావివలస, తాళ్లవలస అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించారు. కేంద్రాలకు వచ్చిన పిల్లలను, రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు

జి.సిగడాం: మండలంలోని పెంట, ఎందువ, చంద్రయ్యపేట, దేవరవలస, జి.సిగడాం, గెద్దకంచరాం, నడిమివలస గ్రామాల్లో గురువారం షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనందపురంలో ఆలయ నిర్మాత మక్క వెంకటిసాయి, సాయి భక్తుల సమక్షంలో పూజలు అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.